మొదలెట్టి కాఫీచేసి అమ్మగార్నీ అయ్యగార్నీ లేపడం నుంచి - వంటలు చెయ్యడం వగైరా అన్ని పన్లూ చేసి రాత్రి భోజనాలు అయ్యేక పక్కలు వెయ్యడం పక్క లెక్కించడం వరకూ మేడమ్‌గారికి మారుగా చెయ్యవలసిన పన్లన్నీ కూడా ఒళ్లు దాచుకోకుండా చేస్తుంది పాపం!"

బండికి సిగ్నల్ ఇచ్చేరు. ఈలలు వేసేరు. ఎనౌన్స్‌మెంట్ కూడా వచ్చింది. నరిసింగరావు "టాటా"గా చెయ్యి ఊపేడు. గార్డు జెండాకూడా ఊపేడు.

"ఇంతకీ నువ్వు హైదరాబాదు ఎందుకు వెళ్తున్నావు?" అన్నాను.

నరిసింగరావు నవ్వేడు. "అది సీక్రెట్టు. ఇప్పుడు చెప్పకూడదు." అన్నాడు.

★ ★ ★

ఆ తరవాత వారం రోజులకి మా జి.ఎమ్.గారు నరిసింగరావుని వెంటబెట్టుకుని నా సెక్షన్‌కి వచ్చేరు. "లుక్ హియర్! ఈయన నర్సింగ్రావ్; మన ఆఫీసులో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఇవాళే జాయినయ్యారు." అని అందరికీ అతన్ని పరిచయం చేసేరు.

"ఇంటర్వ్యూకి వెళ్తున్నట్టు కూడా నాకు చెప్పలేదు!" అని నరిసింగరావుని నిష్ఠూరం ఆడేను.

"వెళ్లేముందు ఈ సెలక్షన్ వచ్చినా జాయినయ్యే ఉద్దేశం పెద్దగాలేదు. కాని ఈ కంపెనీలో "పెర్క్స్" సంగతి నీద్వారా విన్నాక ఇదే బావుందని ఒప్పేసుకున్నాను" అన్నాడు నరిసింగరావు; మా కొత్త ఎ.డి.వో.

★

# 108. సగర్వంగా సగం

ఆ మధ్య ఒక సినిమాలో ఒక పాత్రకి "సగంచాలు!" అనే ఊతపదం ఏర్పాటు చేసి తద్వారా కొంత హాస్యం ఉత్పత్తి చేసేరు. ఇది ఒక స్త్రీ పాత్ర. ఆవిడతో ఎవరూ ఏం మాట్లాడినా, "అంతెందుకు, సగంచాలు!" అంటుంది. ఎవరింటికైనా పలకరించడానికి వెళ్తే అతిథి మర్యాదల్లో భాగంగా ఆవిడకి ఒక కప్పుకాఫీ ఇవ్వబోతే "అంతెందుకు, సగం చాలు" అంటుందన్నమాట. "మొన్న మీరు మీ అమ్మాయికి పిఠాపురం నుంచి సంబంధం తెచ్చేరు కదా; ఏమయింది?" అని ఈవిడ వాళ్లని పరామర్శ చేసినప్పుడు ఆ ఇంటివాళ్లు ఆ పెళ్లిచూపుల ఉదంతాన్ని "అబ్బో! చాలా గొడవైంది లెండి." అని అదంతా వివరించి చెప్పబోతే, "అంతెందుకు; సగం చాలు!" అని తన ఆమోదాన్ని వ్యక్తపరిచేసింది. "ఒక ఎడ్రసు రాసుకోవాలి, కాగితం ఇ"మ్మని అడిగినప్పుడు పావుటావు కాగితం యివ్వబోతే "అంత ఎందుకు, సగం చాలు!" అంటుందన్నమాట. ఓసారి ఇలాంటావిడ ఒకరు అనుకోకుండా మా ఇంట్లో నైట్ హాల్టు ఉండిపోవలసి వచ్చింది. "మారుచీర తెచ్చుకోలేదు" అని ఆవిడ అనగానే మా ఇల్లాలు "దానికేం భాగ్యం" అంటూ ఒక మడత చీరతెచ్చి ఇవ్వబోయింది. ఇంతలో మా కోడలు అడ్డుపడి; "అంతెందుకు అత్తగారూ, సగం చాలు:" అని అందర్నీ నవ్వించింది.

ఏది ఎలావున్నా కాఫీ విషయంలో "సగంచాలు" అనేది ఇప్పటికీ జీవించే ఉంది. మన ఇళ్లకి అతిథులుగా వచ్చేవాళ్లకి కాఫీ ఇస్తాం కదా. "అయ్యబాబోయి, అంత కాఫీ తెచ్చేసేరేంటండోయి. ఇంకో కప్పు తెచ్చివ్వండి; ఇందులో సగం మీకు ఇచ్చేస్తాను" అని అనడం వుంది. వాళ్లు ఒక కప్పు కాఫీని "ఏక్‌దమ్"లో తాగలేనంత నాజూకు నవనాగరికులని ప్రకటించుకోడంతో బాటు, మన

ఇంటికి వచ్చి మనకే కాఫీ ఆఫర్ చేసేటంత ఔన్నత్యానికి ఎదగడం కూడా ఈ "సగంచాలు"లో ఉంది.

చాలా కాలం కిందట ఉత్తరాంధ్రలో "ఇంతోటి పెళ్లికీ రెండు కళ్లకి కాటుకా?" అని ఒక వెటకారపు నుడికారం వుండేది. పెళ్లికి సిద్ధమయ్యే అనర్హులైన వరులను ఎద్దేవా చెయ్యడానికి ఏర్పడింది, ఇది. అప్పట్లో, వయసు మీరిపోయినా రెండో పెళ్లికీ, రెండో ఆవిడ చనిపోతే మూడో పెళ్లికీ సిద్ధం అయిపోయే మగవాళ్లు ఇప్పటికన్నా అప్పుడు ఎక్కువమంది ఉండేవాళ్లు. "పెళ్లి కుమారుడి వయస్సు ఎంతుంటుంది?" అని కన్య తరపువారు అడిగితే "ఎంతో ఏదీ; నలభైకి ఓ ఏడాది అటో ఇటో-" అని మధ్యవర్తులు (నచ్చు) చెప్పడం; "వయస్సు ఎంతైతే ఏమీ? సూదిలో దారం ఎక్కించ గలిగితే పిల్లని ఇచ్చెయ్యొచ్చు!" అని కన్యతరపువారు కాంప్రమైజ్ అయిపోడం ఉండేది. (సూదిలో దారం ఎక్కించగలగడం అనే దాంట్లో దృష్టి సరిగ్గా ఆనడం అనే అర్థమే రూఢంగా వుండేది). అలాంటి ఒక సందర్భంలో; కొద్దిపాటి లోకజ్ఞానం ఏర్పడిన పిల్ల ఈ పెళ్లి తను వ్యతిరేకించినా ఆగదని గ్రహించినప్పుడు ఈ సడింపుగా అని వుంటుందని, అది క్రమంగా నుడికారం అయిందని మనం భావించాలి.

ఓ సారి నేనూ ఎమ్వీయల్లూ ఒక సినిమా చూస్తున్నప్పుడు; ఆట కొంతసేపు అయిన తర్వాత నేను నా కళ్లజోడు తీసి జేబులో పెట్టేసుకున్నాను. అది చూసి ఎమ్వీయల్; "ఆహా! ఈ సినిమా గురించి మీ అభిప్రాయం ఎంత గుంభనగా చెప్పేరండీ! - కళ్లజోడు ప్లస్ కళ్లు మొత్తం నాలుగు కళ్లు! ఈ సినిమా చూడ్డానికి అన్ని కళ్లు అక్కర్లేదని కదా, మీ భావం?" అని వ్యాఖ్యానించేడు. నేను ఏమీ అనకపోయేసరికి తన వ్యాఖ్యానం సరైందే అనుకుని అతను ఈ ఉదంతాన్ని "రియల్‌జోక్స్"అనే శీర్షిక కింద (నాపేరు ఉదహరించి మరీ) ప్రచురించేశాడు కూడాను. అయితే "ఫలానా సినిమా చూస్తున్నప్పుడు" అని రాయకపోడం వల్ల నేను ఎవరి ఆగ్రహానికీ గురి కాకుండా తప్పించుకున్నాను.

కొంతకాలం కిందటి వరకూ ఉద్యోగులు తమ ప్రావిడెంటు ఫండులోంచి అవసరనిమిత్తం అప్పుకోసం అప్లికేషన్లు పెడితే, అధికారులు ఆయా ఉద్యోగుల మేలు కోరిన వాళ్లలాగా, అడిగిన దాంట్లో సగం మాత్రం గ్రాంటు చేసేవారు.

పాతజోకే అయినా, మళ్లీ చెప్పుకుంటే ఇబ్బంది లేనిది ఒకటి వుంది. ఒక పల్లెటూరి ఆసామీ ఏవేవో సరుకులు కొనుక్కోడానికి పట్నం వెళ్లాడట. పట్నంలో ఉన్న అతని మిత్రుడు; "ఇక్కడ అంతా దగా. అంచేత ఏ వస్తువైనా సరే, దుకాణం వారు చెప్పేధరలో సగానికి అడగాలి!" అని వార్నింగు ఇచ్చేడట. పల్లెటూరి ఆసామీ ఒక గొడుగు కొందామని దాని ధర ఎంతో అడిగాడట. "పదహారు రూపాయలు" అంటే "ఎనిమిదికి ఇవ్వవా" అన్నాట్ట. అలా అలా సగంలో సగానికి, అందులో సగానికి బేరం ఆడేస్తూ వుంటే దుకాణదారుడు విసుగ్గా "ఊరికే ఇచ్చేస్తాను పట్టుకుపోవయ్యా" అన్నాట్ట. అప్పుడా పల్లెటూరి ఆసామీ "అలా అయితే రెండు గొడుగులు ఇవ్వండి" అన్నాడట.

మా వూళ్లో కాంతారావు అని ఒక రచయిత ఉన్నారు. ఆయన రాసిన ఒక నవలకి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు బహుమతి ప్రకటించిన సందర్భంగా ఒక అభినందన సభ ఏర్పాటైంది. ఆ సభకి వక్తలుగా మా వూళ్లోనే ఉన్న కనకారావు గారితో సరిపుచ్చుకోక హైదరాబాదు నుంచి ఒక ఉపన్యాసకేసరి గార్ని రప్పించారు. కనకారావుగారు ఎలాంటి సభలోనైనా సరే హాస్య స్ఫోరకంగా

మాట్లాడగల దిట్ట. (నేను కలక్టరాఫీసులో పనిచేసినప్పుడు పంచదారకి కంట్రోలు, పర్మిట్లూ వుండేవి. కనకారావు గారు ఒకనాడు మా ఆఫీసుకి (పంచదార పర్మిట్ కోసం) ఒక అప్లికేషను పుచ్చుకొచ్చారు. సివిల్ సప్లయిస్ డెప్యూటీ తాసిల్దార్‌కి తనకేసు రికమెండు చెయ్యమని నన్నుకోరేరు. "మీకూ షుగర్ జబ్బు ఉందా?" అని నేను వేళాకోళానికి అంటేను; "ఏం చెయ్యమంటారు; ఈ రోజుల్లో పరదార అయినా దొరుకుతోంది గాని పంచదార దొరికి చావటంలేదు" అని తిప్పికొట్టేరు!)

సరే, సభలో కనకారావుగారు ఎలా మాట్లాడుంటారో వేరే చెప్పక్కర్లేదు కదా. ఆ తరువాత ఆ హైదరాబాదాయన మాట్లాడుతూ, "ఇది చాలా గొప్ప నవల అనడం స్తవం కాదు; వాస్తవం! నవలలో ఉన్నటువంటి ఉత్కృష్టతకూ కనకారావు గారి ఉపన్యాసంలో ఉన్నటువంటి వినోదాత్మకతకూ మధ్య ఉన్న నేను కాంతాకనకాల మధ్య ఉన్న అనుభూతి పొందుతున్నాను!" అని - తనకి ఇటువేపూ అటువేపూ సార్థకంగా చూపించేరు. అందరూ చప్పట్లు కొడుతూ వుంటే నేను కూడా కొట్టబోయాను. నా పక్కని కూచున్న ద్విభాష్యం రాజేశ్వరరావు "ఈయన ఉపన్యాసానికి సగం చప్పట్లు చాలు!" అని - రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు - అన్న ధోరణిలో ఒక్క చెయ్యే గాల్లో ఆడించేడు. దాంతో ఆ ఉపన్యాసకేసరి గారు ఇతనేదో ఉపన్యాసం ఆపమంటున్నాడనుకుని తక్షణం హింసావిరమణ చేసేరు.

(ఇదంతా కలిపి నేను చెబుదామనుకున్న దాంట్లో సగమే అని సవినయంగా మనవి చేస్తున్నాను.)

★

# 109. సమానత్వ దర్శనం

**మా**ధవరావు అని నా సహాధ్యాయి. నాకులాగే అతనుకూడా డిపార్ట్‌మెంట్‌లో ప్రమోషను రాక "ఫ్రస్టురేటు" అయిపోయాడు. ఓసారి అదేదో ఉత్తరభారత దేశానికి చెందిన యూనివర్సిటీ "ప్రయివేటుగా లా డిగ్రీ" అనే పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు "పోనీ, ఇలా ఉద్యోగం చేసుకుంటూ మరో డిగ్రీ సంపాదించుకుందాం" అని నన్నుకూడా ముగ్గులోకి లాగేడు.

అదుగో, అప్పుడు తెలిసింది మాకు; మన భారతదేశానికి రాజ్యాంగం అంటూ ఒకటి ఉందని. ఎందుకంటే, "లా-ప్రిలిమినరీ" అని మొదటి ఏడాది ఆఖర్ని రాయవలసిన ఐదు పరీక్షల్లో ఒకటి ఏకంగా కానిస్టిట్యూషన్ మీదనే ఉంది.

జనులంతా సమానం అని అందులో ఉండడం చూసి ఈ పేపరు మన కల్పనాశక్తికి మంచి పదును పెడుతుందని చెప్పేడు మాధవరావు.

మాధవరావూ నేనూ ఆ పరీక్షకి వెళ్లలేదు. అప్లికేషను ఫారం, ప్రాస్పెక్టసూ, సిలబస్సూ అవీ తెప్పించుకున్నాం. మొదటి విడత పాఠాలు (స్టెన్సిల్ తీసిన సెట్టు)కి డబ్బు కడితే తప్ప అసలు అవేవీ సరఫరా చెయ్యం అని ఆ యూనివర్సిటీ అంటేను; చెరో యాభై కట్టేక వచ్చేయి అవి. అక్కణ్ణించి "న్యాయశాస్త్రం" మీద, ఆ సిలబస్సు మీద, చర్చించుకోడంతోనే సరిపోయింది మాకు. ముఖ్యంగా "జనులంతా సమానం" అనే విషయం మీద.

బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోతున్నప్పుడు మన రైల్వేల్లో ఫస్టుక్లాసూ; సెకండ్ క్లాసూ, ఇంటర్ క్లాసూ, థరుడు క్లాసూ అని మొత్తం నాలుగు క్లాసులుండేవి. వీలున్నంతగా ప్రజల్ని వర్గాలుగా చీల్చి,